### ఉచిత కంటి వైద్య శిబిరం

బోథ్, మే 24 : బోథ్‌లో మెడివిజన్ కంటి దవాఖాన హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దీప్ 30 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఉదయ్ కుమార్, ఆంజనేయులు, నందయ్య, రామేశ్వర్ రెడ్డి, సురేశ్ వైద్య, రఘు పతి పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

బోథ్, మే 24: ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని బోథ్ సీఎస్‌సీ నిర్వాహకులు శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం కౌట(బీ) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత ఖాతా నమోదు కార్యక్రమం నిర్వహించారు. 20 మంది ఖాతా తెరిచారు. నిర్వాహకులు మున్సిఫ్ పాల్గొన్నారు.

### ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్, మే 24 : ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలను పకడ్బందీగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పెసా చట్టం మండల కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ, గిరిజనులపై దాడులు చేసే వారిపై చట్టారీత్యా చర్యలతో పాటు అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు.

### ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరండి

భైంసా, మే 24 : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజత్ షేక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భైంసా, కుభీర్, ముధోల్, తానూర్, కుంటాల, లోకేశ్వరం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భైంసాతో పాటు ఆయా మండల కేంద్రాల్లో ఉన్న డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని ఆయన సూచించారు. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

### బీమాను రెన్యూవల్ చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, మే 24 : తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాలు ఉన్నవారు ప్రధానమంత్రి బీమా యోజన కోసం తమ ఖాతాల్లో అవసరమైన నగదు ఉండేలా చూసుకోవాలని ఆబ్యాంకు మేనేజర్ కేవీ ప్రసాద్ తెలిపారు. బీమా యోజన కోసం బ్యాంకులో నమోదు చేసుకున్నవారు తమ బీమా రెన్యువల్ కోసం రూ.456 చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రీమియం రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా సొమ్ము వస్తుందని పేర్కొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు పూర్తి

సోన్, మే 24: సోన్‌లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు పూర్తయినట్లు సీఈవో హరీశ్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 13,310 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశామని, ఇప్పటికే 237 మంది రైతుల ఖాతాల్లో రూ. కోటి 62లక్షలు జమ చేసినట్లు వివరించారు. ఇంకా మిగిలిపోయిన రైతుల ఖాతాల్లో కూడా త్వరలో జమ కానున్నట్లు తెలిపారు.

### బావిలోకి దూకి ఒకరి ఆత్మహత్య

తానూర్, మే, 24 : కోలూర్ గ్రామానికి చెందిన దేవరే మారుతి (45) బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు. మారుతి గత సంవత్సరం తన కూతురి పెళ్లి చేయగా రూ.10 లక్షల వరకు అప్పు కావడంతో అప్పు తీర్చ లేక మద్యానికి బానిస అయ్యాడు. ఈ నెల 22న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి పోయి తిరిగి రాలేదు. శుక్రవారం మారుతి కోసం గాలించగా కోలూర్ తండా నుంచి మసల్గా వెళ్లే రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో శవమై తేలాడు. మృతుడు భార్య పీరాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### నాణ్యత పాటించాలి

కుంటాల, మే, 24 :కల్లూరులోని కేజీబీవీలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను శనివారం ఎంపీడీవో రహీం పరిశీలించారు. గుర్తించిన పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సెక్రటరీ భోజన్న, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

I, P. PADMA (old name) D/O: Odelu @ Nimmathi Renuka, w/o: Nimmathi Ramesh, R/o: H.No: 30-2, Abraham Nagar, Mandamarri mandal, Mancherial Dist, after marriage my name was changed to NIMMATHI RENUKA (New Name) w/o: Nimmathi Ramesh, for all purpose.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# అందుబాటులో అన్ని రకాల విత్తనాలు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

ఎదులాపురం, మే 24 : ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచామని, పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి అక్కడ ఏర్పాటు చేసిన విత్తనమేళాలో ఉంచిన విత్తనాల వివరాలు రైతులకు వివరించారు. అదేవిధంగా పంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 5లక్షల 80వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేందుకు రైతులు సంసిద్ధమయ్యారని, ఇందులో పత్తి పంటకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. పత్తి రైతులకు కావాల్సిన 10లక్షలపైగా విత్తనాలు ప్యాకెట్లలో ఇప్పటికే 8లక్షల ప్యాకెట్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అగ్రికల్చరల్ రిసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ బీ రాంప్రసాద్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్, అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ సోయాబీన్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం రాజేందర్ రెడ్డి, ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎదులాపురం: జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

ముధోల్: విత్తన బ్యాగులను విక్రయిస్తున్న పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు

### పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ముధోల్, మే 24 : పత్తి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య సూచించారు. శుక్రవారం ముధోల్‌లోని పరిశోధన స్థానంలో విత్తన మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా సోయాబీన్, కంది పంటల విక్రయాల గురించి మాట్లాడారు. సోయాచిక్కుడు, కంది పంటలో విడుదలైన వంగడాలను, లభ్యమయ్యే వంగడాలపై వివరించారు. విత్తన శుద్ధి చేసే విధానాన్ని చేసి చూపించారు. అలాగే రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో డా. విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

### సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 24: ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం కొత్తగూడ గ్రామంలో ఆత్రం పరివార్ నిర్వహించిన భావే మహీనా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి పెర్సపేన్ దేవుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో కొత్తగూడ(జీ) మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వీధులను శుభ్రంగా ఉంచాలి

కుంటాల, మే 24 : కల్లూరులో సెగ్రిగేషన్ షెడ్డు, పల్లెప్రకృతి వనం, పార్కు, తదితర ప్రాంతాలను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రహీం, సెక్రటరీ భోజన తదితరులు ఉన్నారు.

### భైంసా ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా సుదర్శన్ రెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న సుదర్శన్ రెడ్డి

భైంసా, మే 24: భైంసాలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డీఈ సుదర్శన్ రెడ్డి శుక్రవారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన వెంకటేశ్వర్లు ఏసీబీకి చిక్కడంతో ఆయన స్థానంలో ఇర్‌చార్జిగా కొనసాగనున్నారు.

### వాహనాన్ని దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్(జీ), మే 24: మండలంలోని ఆటోడ్రైవర్లకు శుక్రవారం వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ హన్మాండ్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాన్ని ఓవర్‌టెక్ చేసేముందు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి అతి వేగంగా నడుపరాదని తెలిపారు. వాహన పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. గురువారం రాత్రి నసిరాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేశామని తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఇంద్రవెల్లి, మే 24: గౌరాపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కొండిబా తల్లి శుక్రవారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అనిల్, మనోహర్, సుంగు, అజయ్, ఉన్నారు.

### యుద్ధప్రతిపాదికన పనులు

సోన్, మే 24: వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు అధికారులు, సిబ్బంది యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నారు. సోన్ మండలంలోని నాలుగు టీంలు ఎక్కడికక్కడే పని చేస్తున్నాయని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. నిరంతరం విద్యుత్‌ను అందించేందుకు వైర్ల కింద పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులు చేస్తున్నామని తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, మే 24: పులిమడుగు గ్రామానికి చెందిన రాథోడ్ మాయ(30) అదే గ్రామానికి చెందిన రాథోడ్ నరేశ్‌తో 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. వ్యవసాయంలో తీవ్ర నష్టం రావడంతో అప్పులు తీర్చలేక మాయ భర్త నరేశ్ 3 సంవత్సరాల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మయా కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషిస్తున్నది. అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది మాయ కూడా ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి జాదవ్ అనుషాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోహర్ తెలిపారు. రాథోడ్ నరేశ్, మాయకు ముగ్గురు మగ పిల్లలు సంతానం. తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం ద్వారా పిల్లలను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బీఆర్ఎస్ నాయకుడిది రాజకీయ ప్రతీకార హత్య

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సుభాష్

బోథ్, మే 24: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డిది రాజకీయ ప్రతీకార హత్యగా భావిస్తున్నామని, ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు సుభాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా గిట్టని వారే ఈ హత్య చేయించి ఉంటారని శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం దీనికి బలాన్ని చేకూరుస్తుందన్నారు. ఈ రకమైన దాడులు, హత్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. ఈ హత్యలపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సోలంకి సత్యనారాయణ, నారాయణ, గోపాల్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న జడ్పీటీసీ తాటిపల్లి రాజు

తాంసి, మే 24 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంజులాశ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తాటిపల్లి రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ, పాఠశాలలో మిషన్ భగీరథ నీరు అందించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభయహస్తం సభ్యుల జమ డబ్బులు చెల్లించాలని అధికారులకు సూచించారు. వెన్నెల సమాఖ్యలో గతంలో అందించిన ట్రాక్టర్‌ను పక్క మండలంలో లీజుకు ఇవ్వడంతో సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ఈజీఎస్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య, పంచాయతీ ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు పలు శాఖల అధికారులకు పనులు సక్రమంగా చేయాలని తెలిపారు. మండలంలోని విద్యుత్ సమస్యలపై అధికారుల దృష్టికి ఎంపీటీసీలు అశోక్, భాగ్యలక్ష్మి తీసుకువచ్చారు. మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో రూ.50 లక్షల 45 వేలు, ఈజీఎస్ రూ.37 లక్షల 80 వేలు పనులు కొనసాగుతున్నాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.. 15 రోజులకు ఒకసారి కూలీలకు డబ్బులు చెల్లించడం జరుగుతుందని ఈజీఎస్ అధికారులు తెలిపారు. సమావేశానికి మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు హాజరు కాగా మరికొందరు గైర్హాజరు కావడంపై జడ్పీటీసీ తాటిపల్లి రాజు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, ఎంపీటీసీ అశోక్, భాగ్యలక్ష్మి నాయబ్ తహసీల్దార్ విష్ణు, సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీవో స్వప్న, పంచాయతీ కార్యదర్శులు బండి విజయ్‌కుమార్, నగేశ్ పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల తనిఖీ

బోథ్: విత్తనాల ప్యాకెట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏడీఏ, ఏవో, ఎస్ఐ

బోథ్, మే 24: బోథ్‌లోని విత్తన దుకాణాలను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తనిఖీలు చేశారు. ఆయా షాపుల్లో విక్రయిస్తున్న విత్తనాల ప్యాకెట్లు, లాట్ నంబర్లు, స్టాక్, అమ్మకం రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాష్ చందర్ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ శ్రీధర్ స్వామి, ఎస్ఐ రాము, వ్యవసాయాధికారి వెండె విశ్వామిత్ర, ఏఈవోలు పాల్గొన్నారు.

ఇచ్చోడ, మే 24: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిరికొండ ఎస్ఐ నవీన్ గౌడ్ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. సిరికొండలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం దృశ్య నకిలీ, లూజ్, గుర్తింపు పొందని కంపెనీల విత్తనాలు ఎట్టి పరిస్థితిల్లో విక్రయించరాదన్నారు. ఏమైన సమస్యలుంటే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ సూచించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏవోలు

పెంబి: విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శంకర్

దీపక్, ప్రవీణ్, రోహిణి, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రకాశ్, బారిక్ రావ్, ప్రతాప్, దత్తు, రమేశ్ పాల్గొన్నారు.

పెంబి, మే 24: మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఏవో రవి, ఎస్ఐ శంకర్ తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు.

ముధోల్, మే, 24 : ఎడ్‌బిడ్ గ్రామంలో సీడ్స్ అండ్ ఫెర్టిసైడ్స్ దుకాణాలను ఏవో భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణంలో నిల్వ గల స్టాక్ ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో శ్రీనివాస్ ఉన్నారు.

లక్ష్మణచాంద, మే 24: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్ఐ శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తన బ్యాగులను పరిశీలించారు. అనుమతిలేని, కాలం చెల్లిన విత్తనాలు రైతులకు విక్రయించరాదని అమ్మకందారులకు సూచించారు.

గుడిహత్నూర్, మే 24 : మండలంలోని విత్తనాల దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. మండల కేంద్రంతో పాటు తోషం గ్రామంలోని విత్తన దుకాణాలను తహసీల్దార్ కవితారెడ్డి, మండల వ్యవసాయాధికారి రేవతి తనిఖీ చేశారు. స్టాక్, బిల్లు రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని షాపు నిర్వాహకులకు హెచ్చరించారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

మర్లపల్లి దగ్గర పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న ఆడె గజేందర్

బోథ్, మే 24: ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడ్డ నష్టాన్ని ప్రజలు అధికారులతో సమన్వయపరిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. రెండు రోజులుగా ఈదురుగాలుల బీభత్సంతో మండలంలోని మర్లపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో కూలిన, ధ్వంసమైన ఇండ్లను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ వడగళ్ల వానకు దెబ్బతిన్న ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రపుల్ చందర్‌రెడ్డి, ఎంపీటీసీ షేక్ నాజర్ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్, మాజీ సర్పంచ్ రాజు యాదవ్, డైరెక్టర్ అబ్రర్, సాయన్న, గడ్డల నారాయణ, మైనార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రహిమొద్దీన్ పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ



ఖలీల్ తండ్రిని పరామర్శిస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, మే 24: బీఆర్ఎస్ కార్యకర్త సోహెల్ తండ్రి ఖలీల్ హైమద్ చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో వెన్నుపూస విరిగింది. శుక్రవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ ఖలీల్ తండ్రిని నిర్మల్‌లోని ప్రైవేట్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకుడు శ్రీధర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, ఇఫ్తేకర్ ఉన్నారు.

బోథ్, మే 24 : హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో మండలానికి చెందిన సోలంకి సాయికిరణ్ చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం దవాఖానకు వెళ్లి సాయికిరణ్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

### కొలతల ప్రకారం పనులు చేయాలి

ఇచ్చోడ, మే 24: ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పని చేసి కూలి డబ్బులు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గేర్జం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల మాస్టర్ రికార్డును పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

### కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

మాట్లాడుతున్న సిరికొండ ఎంపీడీవో బాల గంగాధర్ తిలక్

ఇచ్చోడ(సిరికొండ), మే 24: కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిరికొండ ఎంపీడీవో బాల గంగాధర్ తిలక్ సూచించారు. శుక్రవారం సిరికొండలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా కార్యదర్శుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూసుకునే బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శులు శ్రీనివాస్, నాగభూషణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

### జీలుగ విత్తనాలు పంపిణీ

జీలుగ విత్తనాలు పంపిణీని చేస్తున్న మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్

లక్ష్మణచాంద, మే 24: మండల కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు 60 శాత రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధర రూ. 1116 చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ఉదయ్, ఏఈవో ఉమా మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

### జొన్న లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

మీర్జాపూర్ వద్ద బోల్తా పడిన జొన్నల లారీ

భైంసాటౌన్, మే 24 : కుంటాల మండల పీఏసీఎస్ సెంటర్ నుంచి జొన్నల లోడ్‌తో కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి వెళ్తున్న లారీ మీర్జాపూర్ గ్రామ సమీపంలో బర్రెలను తప్పించే క్రమంలో బోల్తా పడింది. డ్రైవర్ రఫీక్ మహ్మద్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు.

### అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

సోన్, మే 24: జాఫ్రాపూర్ గ్రామంలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు. పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి నాణ్యతతో చేసేలా చూడాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో కలీం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

### రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి

తాంసి, మే 24 : పొన్నారి గ్రామ సమీపంలోని రైల్వే గేట్ 29 వద్ద ట్రెంచ్ మొత్తం కూరుకుపోయి వర్షపునీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన మేనేజర్ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 15 నుంచి 20 రోజుల్లోగా సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ వైస్ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, మాజీ సర్పంచ్ అండె అశోక్, బీఆర్ఎస్ నాయకులు అండె ఆనంద్, చంద